# చెప్పబోయిన కథ

తమ్మినేని అక్కిరాజు

"ఆమె అతన్ని ప్రేమించింది."

"బాగుంది."

"అతనూ ఆమెను ప్రేమించాడు."

"చాలా బాగుంది."

"ఇద్దరూ ఒకరి నొకరు ప్రేమించు కున్నారు."

"చాలా చాలా బాగుంది."

"కాని అది మంచిరోజో, చెడ్డ రోజో నాకు తెలీదు. వున్నట్టుండి వాళ్ళిద్దరూ విడిపోయారు."

"ఇది ఇంకా బాగుంది."

"అదేమిటోయ్ వాళ్ళు ప్రేమించుకున్నారంటే బాగుందన్నావ్, విడిపోయారన్నా బాగుందంటావేంటి? అసలు విషయం అడక్క."

"నాకు తెలియకపోతేగదా! నిన్ను అడగటం."

"ఏం! తెలుసా నీకు? అసలు వాళ్ళెవరో తెలుసా!"

వాళ్ళెవరో నాకు తెలియకపోవచ్చు నాకా ప్రత్యేక వ్యక్తులతో పనిలేదుకూడా. మానవుడి జీవన విధానం వాడి మానసిక విధానం కూడా వాడు పెరిగే వ్యవస్థకు ప్రతిరూపాలు, ఆ వ్యవస్థ దోపిడీ ప్రధాన సూత్రంగా కలిగియున్నపుడు ఆ మానవుడు, వాడి మానసిక భావాలు కూడా దోపిడీ చేస్తూనో, దోపిడీ చేయబడుతూనో వుంటూంటాయి. అందుచేత మనసుకు సంబంధించిన ప్రేమానురాగాలు, మమతానుబంధాలువంటి అమూల్యమైన భావాలు కూడా సంకుచితమైన పరిధిలో నేవుంటాయి. వాటి వాటి స్వప్రయోజనాలు నెరవేరగానే అవి మాయమౌతాయి. అలాంటిదే నువ్వు చెప్పే కథ."

"నువ్వు చెప్పిందేవిటో నాకర్థం కాలేదు."

"అయితే నేను కొన్ని కథలు చెబుతాను. ఆ తరువాత అర్థమవుతుంది."

* * *

## కథ 1:

"అతని ముక్కు అందంగా వుంటుందని అతన్ని ప్రేమించింది. పెళ్ళికాకుండా వ్యవహారాలు సాగిపోయాయి. కొదికాలం ఆనందంగానే గడిచిపోయింది. కాని రాను రాను ముక్కుమీద ముక్కువకంటే పొట్ట బాధ ఎక్కువైంది, అతనికి ఉద్యోగం లేదు. అప్పుడప్పుడు పస్తులు అయినా సరే ఆమె భరించింది. ఉన్నవన్నీ అమ్ముకున్నారు. అమ్ముకు తిన్న కొది రోజులు ఆమె



ముక్కును కౌగలించుకు పడుకుంది. అమ్ముకోడానికి కూడా ఏం లేకపోయేసరికి ముక్కును వదిలేసింది. ముక్కులో అందం పోయిందంది. ఒకప్పుడుండేది కాని యిప్పుడు లేదంది. వాళ్ళ ప్రేమ జీవితం అక్కడితో పరిసమాప్తమైంది. వాళ్ళు యిప్పుడు విడివిడినే జీవిస్తున్నారు. వాళ్ళ సంసార జీవితాలు మనకు అప్రస్తుతం."

## కథ 2:

"ఆమె అందమైంది. అందమంటే ఏమిటని అడగొద్దు ఒక్కొక్కరి కంటికి ఒక్కొక్కటి అందం. పలువరుస బాగుంటుంది. నడక బాగుంటుంది. నడుం బాగుంటుంది నవ్వు బాగుంటుంది. మనసు, గుణం, మరేదో, మరేదో... ఒక హీరో యివన్నీ అందగా వున్నాయన్నాడు. ఆమె ఆనందించింది. అవకాశ మిచ్చింది. అనుభవించమంది. అందాలు త్రాగారు. ఆనందాలు పొందారు. కాలం చాలా గడిచింది. ఎందుచేతో మన



హీరోగారి ముందు చూసిన అందాలన్నీ అందవికారాలుగా కనిపించాయి. ఆమెను మోసం చేశాడు. ఆమెకు కోపం వచ్చింది. తనను ఒకడు మోసం చేస్తే ఆమె వరుసగా ఐదుగురిని మోసం చేసింది. అందరి దగ్గరా ఒకటే మాట — "నువ్వే నా సర్వస్వం." కాని అందులో ఎవ్వరినీ పెళ్ళిచేసుకోలేదు. ఆమె చివరిసారిగా నాతో అన్నమాటలు "డబ్బులేకపోతే ప్రేమకు విలువ లేదని"—



ఎక్కువ చదవాలి కొద్దీ మనకున్న జ్ఞానం ఎంత కొంచెమో తెలుస్తుంది. సంపదలు పెరిగినకొద్దీ అనుభవించేది ఎంత స్వల్పమో తెలుస్తుంది.

—రోష్ ఫోకాల్డ్

* * *

గొప్ప గొప్ప వేదాంత గ్రంథాలకన్నా చిన్న చిన్న సూక్తులే మన గుండెకు సూటిగా తగిలి హృదయానికి హత్తుకుంటాయి.

—మదాం సెల్

* * *

ఒక అబద్ధం చెప్పటం అంటే తనెంత అవివేకంగా ప్రవర్తిస్తున్నదీ తెలుసుకోవాలి. ఒక అబద్ధం చెప్పి పుచ్చుకోవడానికి మరో ఇరవై అబద్ధాలాడ వలసివస్తుంది.

—పోప్

* * *

ఎల్లప్పుడు ప్రేమతో పాటే పుట్టుకవస్తుంది ద్వేషం కూడా-కాని దానితోపాటే నశించదు.

—రోచ్ ఫోకాల్డ్

* * *

జీవితం ఆద్యంతమూ సుఖంగా జరిగిపోతుంటే కష్టం విలువ తెలియదు. అప్పుడు సుఖం జరిగి కూడా విసుగనిపిస్తుంది.

—అబ్రహాం లింకన్

* * *

పరోక్ష మంచి జన్మపై ఆశలేని వారు ఈ జన్మలో మృతప్రాయులై జీవిస్తుంటారు

—గెథే

* * *

మానవులందరి ఆత్మలు శాశ్వతమైనవే వాటికి మరణం లేదు. కాని, సచ్ఛీలుర ఆత్మలు మరణాన్ని జయించడమేగాక, దివ్యత్వాన్ని కూడా పొందుతాయి.

—సోక్రటీసు

* * *

ప్రపంచంలో ప్రజాభిప్రాయం అనే దాన్ని మించిన అసత్యం మరొకటి లేదు.

... టి. వి. మెకాలే

సేకరణ: అయాషా హనీఫ్

ఆ తరువాత ఆమె నాకు కనిపించలేదు బహుశా డబ్బు సంపాదించే ఏర్పాట్లో ఉందేమో."

### కథ 3:


"అతను చదువుకున్నాడు. ఉద్యోగం లేదు. అతని చదువు ఎందుకు ఉపయోగపడుతుందో అతనికి తెలియదు. చదువు ఉద్యోగంకోసమే అనుకున్నాడు. ఉద్యోగం వస్తే రెండు చేతులా సంపాదిదామనుకున్నాడు. టిప్‌టాప్‌గా తిరిగాడు. కాని జీవితం తారుమారయింది. ఉద్యోగం రానం



దుకు ఎవరిని తిట్టాలో తెలియక తనను తానే తిట్టుకున్నాడు. చాలాసార్లు దేవుణ్ణి కూడా తిట్టాడు. చివరకు తాను ప్రేమించిన పేద పిల్లను పెళ్ళిచేసుకున్నాడు. "నీ ప్రేమ నాకు చాలు" అన్నాడు. కాని అతని ప్రేమ రహస్యం చాలా ఘోరమయింది. ఆమెను యీనాడు డబ్బులున్న వాళ్ళకు తార్పి మునుపటిలాగే టిప్‌టాప్‌గా జీవించేస్తున్నాడు...."

### కథ 4:

"ఆమె లక్షాధికారికూతురు. పొరపాటున ఒక జెల్సారాయుడి చేతిలో పడింది. వాడు మంచి నటుడు. సినిమాలో కాదు జీవితంలో. చాలా మంచి మంచి కబుర్లు చెప్పాడు. ప్రేమ చాలా విలువైందన్నాడు. నువ్వుంటే



చాలు నీ డబ్బుతో నాకు పనిలేదన్నాడు. అంటూనే ఆమె డబ్బుతో జెల్సా చేస్తున్నాడు. జీవితం సిగరెట్టు దమ్ము లాగి వొదిలినంత హాయిగా వుంది. ఉన్నట్టుండి ఆమె పేదదైంది. ఎందుకయిందో, ఎలా అయిందో మనకి తెలీదు. తెలిసినా అనవసరం (ఎవరయినా సినిమా తీయదల్చుకుంటే చెప్పండి చెబుతా) అంతే. ఆ అందగాడు మళ్ళీ కనిపించలేదు. ఇంతే సంగతులు చిత్తగించవలెను అన్నాడు. ఆమె ఏమయింది? ఆమె అందంగానే వుందా? ఎక్కడ ఎలా జీవిస్తోంది? అన్న ప్రశ్నలు పత్రిక మార్కుడిని అడిగి తెలుసుకోవాలి."

### కథ 5

"బొంబాయిలో అమ్మాయిల్ని కొంటున్నారని తెలిసి ఒక ప్రేమికుడు తన "ప్రేమ సామ్రాజ్యాన్ని" ఎక్స్‌ప్రెస్‌లో పార్సిల్ చేసేవాడు. అక్కడి మంచి వాడు



అలవాటుపడిపోయి యిలాంటి సామ్రాజ్యాలు చాలా స్థాపించి వాటి నన్నిటిని అలాగే పార్సిలు చేయటం వ్యాపారంగా పెట్టుకుని జీవిస్తున్నాడు.

* * *

"ప్రేమలన్నీ యింతే నంటావా?" అడిగాను.

"అలా అనను. ప్రేమకొక అమూల్యమైన విలువవుంది. అని ఆ విలువకి యీ సమాజంలో స్థానంలేదు. డబ్బుంటే చాలు వ్యక్తి యొక్క మంచితనంతోను - ప్రేమతోను - సంబంధంలేకుండా మానవుడు జీవిస్తున్నాడు. అందుకే అందరికీ డబ్బు సంపాదించాలని కాంక్ష. కాని అది అందరికీ ఎలా వీలుపడుతుంది. వీలుపడకపోయినా అందరు మాత్రం అదే "ఉద్దేశం"తో జీవిస్తూంటారు. మానవుడు శ్రమించేది "డబ్బు సంపాదనకోసం" అనే సూత్రానికి తిలోదకాలిచ్చి "సుఖంగా బ్రతకటంకోసం" అనే సూత్రాన్ని అవలంబిస్తే

మన సమాజంలో ప్రేమ విలువలు దిగజార తాయి. అందుకే యిది ఎవరికి వాళ్ళు చేసే పని కాదు. వ్యవస్థ యొక్క 'ఆర్థిక విధానం' అలాంటిది. ముందు దాన్ని మార్చాలి. అప్పుడే ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది. అంతవరకూ ప్రేమ డబ్బునే ప్రేమిస్తుంది.

"నువ్వు చెప్పినదాంట్లో నాకొకటి అర్థం కాలేదు," అన్నాను.

"ఏమిటి" అడిగాడు కథకుడు.

"మానవుడి 'శ్రమ అందరూ సుఖంగా బ్రతకటం కోసం ఉపయోగపడాలి" అన్నారు. "అందుకు ఏం చెయ్యాలి?"

"వాడు దేనిమీదైతే శ్రమ చేస్తున్నాడో ఆ సాధనాలన్నీ—అంటే భూములు, యంత్రాలు .. యిలాంటి వన్నీ — వ్యక్తి యొక్క సొంత ఆస్తిగా కాకుండా వ్యక్తుల అందరి ఆస్తిగా వుండాలి. అప్పుడే మనిషిలో వున్న లేకి భావాలు పోతాయి. మానవుడు స్వేచ్ఛంగా జీవించగలుగుతాడు. ఆ నాడు నిజమైన ప్రేమ నిలుస్తుంది. డబ్బు కోసం తండ్రిని పొడిచే తనయులు, భార్యను తార్చే భర్తలూ వుండరు. బ్రతకటం కోసం శరీరాన్ని అమ్ముకునే స్త్రీలు ఉండరు."

నాకు జ్ఞానోదయం అయింది. నేనేం చెయ్యాలో తెలిసింది. కథకుడికి ఒక నమస్కారం పెట్టి లేవబోయాను

'యింతకీ నువ్వు 'చెప్పబోయిన కథ' ఏమయింది?" అన్నాడు కథకుడు.

"నే 'చెప్పబోయిన కథ' కూడా ఇలాంటిదే. ఈ వ్యవస్థలో ఈ ఫలింతే కాబోలు."

"అవును. ప్రేమానురాగాలు. మమతానుబంధాల కంటే కూడా ఆర్థిక సంబంధాలు బలమైనవి.

"అయితే ప్రేమించి డబ్బులేదని బాధపడటంకంటే డబ్బులు చూసుకుని ప్రేమించటం మంచిదంటావు?"

"అంత వ్యంగ్యంగా మాటాడి మంచి ప్రేమికుడిని అవమానించకూడదు. అది ఈ వ్యవస్థలో వున్న లోపం అని చెప్పటం వరకే మన పని. ఏం చేస్తాం పుత్రప్రేమ, సోదరప్రేమ, మాతృప్రేమ, పితృప్రేమ యింకా అభిమానం - నురాగం పాడుకున్న అన్నిరకాల ప్రేమల్ని. డబ్బు 'డామినేట్' చేస్తోంది. తండ్రిని కొడుకును విడదీస్తోంది. భార్యా భర్తల్ని వేరు చేస్తోంది. నాలుగు డబ్బులు కలిసొస్తున్నాయంటే- తాను ప్రేమించిన వాళ్ళనే 'విషం' పెట్టి చంపిస్తోంది. గోడ తగువు. చూరు తగువు, గట్టు తగువు. షట తగువు. పేడ తగువు, పిడక తగువు. పేర్లతో తలలు బద్దలు కొట్టుకునేటట్టు చేస్తోంది. కుళ్ళు కుతంత్రాలతోటి, కుట్రలు కలహాలతోటి, అసూయాద్వేషాలతోటి- మానవుడు 'ఒంటరిగానే' జీవిస్తున్నాడు. తనతోటి మనుషులంతా పరమ దుర్మార్గులని, ఎవరిని నమ్మకూడదని భావిస్తున్నాడు. డబ్బు ఉంటే 'షాపు'లో లేకపోతే 'పాక'లో తాగి 'ఏం-ఎదవ బతుకు' అని తనమీద తనే ఉమ్మి వేసుకుంటున్నాడు. కనీసం తనని తాను ప్రేమించుకోలేకపోతున్నాడు. అందుకు కారణం ఈ వ్యవస్థే. ఈ వ్యవస్థలో ప్రేమ విలువ లింతే '

ఆ తరువాత నేను కథకుడిని ఎలాంటి ప్రశ్నలూ వేయలేదు.

మా యిద్దరి మధ్యా కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా గడచిపోయాయి. ★

